# ఎక్కడి చెత్త అక్కడే

- చెత్త కుండీలు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- అసహనం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు



జేపీఎన్ రోడ్డులో లేబర్ అడ్డా వద్ద పేరుకుపోయిన చెత్త



పాఠశాల వద్ద వేసిన చెత్త

కామారెడ్డి, డిసెంబర్ 28 : జిల్లా కేంద్రంలోని కాలనీలు, పలు కూడళ్లలో చెత్త పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు పైనే చెత్త పేరుకుపోతున్నది. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం పట్టణవాసులకు ఇబ్బందికరంగా మారింది. చెత్త పేరుకుపోయి దుర్వాసన రావడంతో ప్రజలు ముక్కు మూసుకొని వెళ్తున్నారు. అధికారులు చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది అలసత్వంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. దోమలు, క్రిమి కీటకాలు ఎక్కువై ఇండ్లల్లో ఉన్న ఆహారపదార్థాలపై వాలుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల పాలవుతున్నారు. అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యానగర్ కాలనీలోని వాగ్దేవి పాఠశాల వద్ద చెత్తను రోడ్డుపైనే పడేస్తున్నారు. ఇక్కడ చెత్త డబ్బాను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జేపీఎన్ రోడ్డులోని లేబర్ అడ్డ వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలో చెత్తను రోడ్డుపైనే వేస్తున్నారు. లేబర్ కోసం వచ్చే వారు అక్కడే నిలబడతారు. రోడ్లపైన చెత్తను వేయడంతో పని చేసుకునే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ తెలంగాణ పేరుతో పట్టణంలో పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా రోడ్లపై చెత్తను వేయకుండా చెత్త కుండీలు, చెత్తను తీసుకెళ్లే ఆటోలను ఏర్పాటు చేసి పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిశుభ్రతపై చర్యలు తీసుకోవడం లేదు. పేరుకు మాత్రమే అభివృద్ధి అని చెప్పుకోవడం తప్పా క్షేత్రస్థాయిలో ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను శుభ్రం చేసి చెత్త కుండీలను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### చెత్త కుండీలు ఏర్పాటు చేయాలి



చెత్తను ఎక్కడపడితే అక్కడే పారవేస్తున్నారు. ప్రతి కాలనీలోని కూడలి వద్ద చెత్త కుండీలను ఏర్పాటు చేస్తే ఈ సమస్యను పరిష్కరించవచ్చు. చెత్త కుండీలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చెత్త కుండీలు ఏర్పాటు చేయాలి.

**- శివ ప్రసాద్, కామారెడ్డి**

### చెత్త కుండీలు ఏర్పాటు చేస్తాం



కామారెడ్డి పట్టణంలోని పలు కూడళ్ల వద్ద చెత్త కుండీలు ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఎంత అవగాహన కల్పించినా చెత్తను రోడ్లపైనే వేస్తున్నారు. చెత్తను తీసుకెళ్లే ఆటోలు వచ్చినప్పటికీ కాలనీలోని కూడలి వద్ద చెత్తను పారేసి వెళ్తున్నారు. ఇకపై రోడ్డుపైన చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం.

**- స్పందన, మున్సిపల్ కమిషనర్**

## రైతులకు ఎరువులు సకాలంలో అందజేస్తాం..



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి తిరుమల ప్రసాద్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మాచారెడ్డి, డిసెంబర్ 28 : రైతులకు ఎరువులు సకాలంలో అందజేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. 'మాచారెడ్డి సొసైటీలో ఎరువుల కొరత' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి తిరుమల ప్రసాద్ స్పందించి మాచారెడ్డి సొసైటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమార్‌పేట గ్రామంలో ఫెర్టిలైజర్ షాపు లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకపోవడంతో ఎరువులు పంపించలేదని, ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మూడు రోజుల్లో డీఏపీ ఎరువులు సొసైటీకి చేరుకుంటాయని తెలిపారు. అనంతరం సొసైటీలోని స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి సీఈవో చంద్రారెడ్డితో మాట్లాడారు. ఆయన వెంట కామారెడ్డి ఏడీఏ అపర్ణ, మాచారెడ్డి ఏవో పవన్‌కుమార్, ఏఈవోలు ఉన్నారు.

## జనవరి 1 నుంచి నిరవధిక సమ్మె



సమ్మె నోటీసు ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కామారెడ్డి, డిసెంబర్ 28 : జనవరి 1వ తేదీ నుంచి చేపట్టే నిరవధిక సమ్మె కోసం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని సివిల్ సప్లై హమాలీ, ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో సివిల్ సప్లై హమాలీ జిల్లా అధికారి భిక్షపతికి శనివారం నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హమాలీలకు ఎగుమతి, దిగుమతి రేట్లు పెంచాలని, ఈఎస్ఐ పీఎఫ్ ఇవ్వాలని కోరుతూ నిరవధిక సమ్మెకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ఉపాధ్యక్షుడు దశరథ్, మైపాల్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

బీబీపేట్, డిసెంబర్ 28: మండలంలోని ఉప్పర్‌పల్లి రోడ్డు వద్ద ఏఎస్సై మధుసూదన్‌రావు, సిబ్బంది కలిసి శనివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణలు లేని 45 మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రంజిత్‌గౌడ్, రవి పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్లు అందజేత




బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్సై అనిల్

మాచారెడ్డి, డిసెంబర్ 28 : మాచారెడ్డికి చెందిన చల్లా సుధాకర్, దేవసోత్ మల్లికార్జున్, ఘన్‌పూర్‌కు చెందిన తోకల రాము ఇటీవల ఫోన్లు పోగొట్టుకున్నారు. బాధితులు వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్లును బాధితులకు శనివారం అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

## 'బ్యాక్ లాగ్ పోస్టులను అమ్ముకునే కుట్ర'



మాట్లాడుతున్న తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ అధ్యక్షుడు మహిపాల్

కామారెడ్డి, డిసెంబర్ 28 : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను అమ్ముకునే కుట్ర జరుగుతున్నదని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో బ్యాక్ లాగ్ పోస్టులు ఉన్నాయని, రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని మెరిట్, రిజర్వేషన్లతో సంబంధం లేకుండా ఒక్కో పోస్టుకు లక్షల రూపాయలు తీసుకుంటూ ఉద్యోగాలను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తర్వాత పలుకుబడి ఉపయోగించి ఆ ఉద్యోగాలను పర్మినెంట్ చేయిస్తున్నారని చెప్పారు. కామారెడ్డిలో కూడా ఈ కుట్ర అమలుకు శ్రీకారం చుడుతున్నారని అన్నారు. రెండు నెలల క్రితం నుంచి ఈ విధానాన్ని అడ్డుకునేందుకు తాను రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు తిరిగి ప్రజలు, నిరుద్యోగులను చైతన్యపరిచేలా ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఎస్‌వో సంఘం సభ్యులు

బాన్సువాడ, డిసెంబర్ 28 : పెండింగ్‌లో ఉన్న డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ను విడుదల చేయాలని లంబాడా స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ఎస్‌వో) జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్ నాయక్ బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగైదు ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. పేద విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నారు. కార్యక్రమంలో లంబాడా స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా నాయకులు వికాస్ నాయక్, బాన్సువాడ నగర సభ్యుడు గాబర్ నాయక్ తదితరులు ఉన్నారు.

## జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, డిసెంబర్ 28 : బీర్కూర్‌కు చెందిన లింగారాం (35) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. లింగారాం కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఆరు నెలల క్రితం భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లింది. తల్లి, అన్న, వదినతో కలిసి మూడు నెలల క్రితం పనుల కోసం నిజామాబాద్‌కు వలస వెళ్లాడు. బీర్కూర్‌లో పని ఉందని చెప్పి నిజామాబాద్ నుంచి శుక్రవారం ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం చుట్టు పక్కన వాళ్లు, బంధువులు నిద్ర లేపే ప్రయత్నం చేయగా తలుపులు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కుంటలో పడి ఒకరి మృతి

మాచారెడ్డి, డిసెంబర్ 28 : చెరువు కుంటలో పడి ఒకరు మృతిచెందిన ఘటన పాల్వంచలోని చామల కుంట చెరువులో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మంథనిదేవునిపల్లి గ్రామానికి చెందిన గుండెల్లి దేవరాజు(39) డప్పు బాగు చేయించుకోవడానికి ఈ నెల 25న కామారెడ్డికి వెళ్లాడు. ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదు. చామలకుంట చెరువులో ప్రమాదవశాత్తు పడి చనిపోయినట్లు గుర్తించినట్లు ఎస్సై వివరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

## మహనీయుల చరిత్రలు స్ఫూర్తిదాయకం



మద్నూర్ గురుకుల పాఠశాలలో మౌనం పాటిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మద్నూర్/లింగంపేట(తాడ్వాయి)/ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 28 : మహనీయుల చరిత్రలు సదా స్ఫూర్తిదాయకమని ప్రిన్సిపాల్ గంగాకిశోర్ అన్నారు. శనివారం మద్నూర్ మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా విద్యార్థులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్, గణేశ్, రాజు, నరహరి, రాము, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు. తాడ్వాయి ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణాగౌడ్, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్, టీఏలు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ –ప్రోగ్రాం జాతీయ సేవాసమితి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, అధ్యాపకులు శివప్రసాద్, అమరేశం, ప్రభాకర్‌రావు, గంగారెడ్డి, సిద్ధరాజు, శశిధర్, చంద్రకాంత్, సంతోష్, రాణి, సంగీత, స్వప్న, మోయిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చికిత్సపొందుతూ మహిళ మృతి

రామారెడ్డి, డిసెంబర్ 28 : సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ గ్రామంలో పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారావుపేట్ గ్రామానికి చెందిన కోరబోయిన రాజమణి(57) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నది. నొప్పి ఎంతకీ తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల12న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శనివారం తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, **KONAPATRI SRIDHAR,** R/o. H.No. 3-86, Brahmanpally, (M) Jakranpally, (D) Nizamabad. Changed my Surname / Name as **KONAPATHRI SRIDHAR**
**NTZ-338367**

**WANTED**

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
**NT-338986-All**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# 'ఉపాధి' సామాజిక తనిఖీ ప్రజావేదిక




ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిరూరల్, డిసెంబర్ 28: ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో 15వ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను మండల ప్రత్యేకాధికారి, ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ వామనరావు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నిర్వహించిన పనుల్లో నిధులు దుర్వినియోగమయితే చర్యలు తప్పవన్నారు. మండలంలోని 31 గ్రామపంచాయతీల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 240 పనులకు సంబంధించిన 2కోట్ల 96లక్షల 16వేల 376 రూపాయల నిధులపై ఎస్ఆర్పీ, డీఆర్పీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సిద్ధం చేసిన నివేదికలను చదివి వినిపించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఈజీఎస్ అధికారులను ఆయన ఆదేశించారు. నివేదికలను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో ప్రకాశ్, ఈజీఎస్ఏపీవో వినోద్‌గౌడ్, అంబుడ్స్‌మెన్, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు, గ్రామ కార్యదర్శులు, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు పాల్గొన్నారు.

## అడవిని తలపిస్తున్న పల్లె ప్రకృతివనం



గోపాల్‌పేటలోని పల్లె ప్రకృతి వనం

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 28: మండల కేంద్రం గోపాల్‌పేట ఉన్నత పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో చెట్లు పెరిగి పర్యవేక్షణ లేక అడివిని తలపిస్తున్నది. వనంలోని చెట్లు ఏపుగా పెరిగి పాఠశాల ముందున్న ప్రాంతం మొత్తం నిండిపోయింది. పంచాయతీ అధికారులు ఏడాదికాలంగా చెట్ల కొమ్మలు తొలగించడం లేదు. వాటి సంరక్షణను పూర్తిగా విస్మరించారు. దీంతో పల్లె ప్రకృతి వనంలోని దారులు, సేద తీరేందుకు వేసిన బల్లలు కనుమరుగయ్యాయి. దీంతో రాత్రి వేళ వనంలోకి అడవి పందులు వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కోతులు, పాములకు నెలవుగా మారిందని, విద్యార్థులు అటువైపు వెళ్లడానికి భయపడుతున్నారు. అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించి, పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగింపజేసి సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


## ప్రమాద బీమా చెక్కు అందజేత

నిజాంసాగర్, డిసెంబర్ 28 : మండలంలోని మాగీ గాయత్రి షుగర్స్‌లో కొన్నేండ్ల నుంచి పని చేస్తున్న సునీల్ అనారోగ్యంతో చనిపోవడంతో అతని భార్య అనసూయకు శనివారం ఫ్యాక్టరీ యాజమాన్యం, బీఎంఎస్ అధ్యక్షుడు మహిపాల్ ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి పండరి, కార్మికులు పాల్గొన్నారు.

## బిచ్కుంద 'ప్రజావాణి'కి సబ్ కలెక్టర్

బిచ్కుంద, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పాల్గొంటారని కార్యాలయ సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జుక్కల్ నియోజకవర్గ ప్రజలు కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లకుండా బిచ్కుందలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు విన్నవించుకొని, సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

## లింగంపేటలో చోరీ



దుండగులు ఇంట్లో చొరబడి చిందరవందరగా చేసిన బట్టలు

లింగంపేట, డిసెంబర్ 28: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొట్టూరి సుశీల వారం క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన సుశీల తాళం ధ్వంసం చేసి ఉండడంతో చూసి చోరీ జరిగినట్లు గుర్తించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా పెట్టె ధ్వంసం చేయడంతో పాటు బట్టలు కింద పారవేసి, పలు దుస్తులు కాల్చివేసినట్లు గుర్తించింది. ఇంట్లో నుంచి పదివేల రూపాయల నగదుతో పాటు అర తులం బంగారం అపహరించుకుపోయినట్లు ఆమె తెలిపారు. తాళాలు వేసిన ఇండ్లనే లక్ష్యంగా చేసుకొని దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.


## కాలువ నిర్మాణ పనుల పరిశీలన



కట్టుకాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ డీఈఈ మనోహర్‌రెడ్డి

లింగంపేట, డిసెంబర్ 28: మండల కేంద్రంలో కట్టు కాలువ నిర్మాణ పనులను నీటిపారుదల శాఖ డీఈఈ మనోహర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. మత్తడి కాలువ నుంచి చీరపేండ్ల కుంట, సూర్ణ కుంటలోకి సాగు నీటిని సరఫరా చేసే కాలువ శిథిలావస్థకు చేరుకున్నది. కాలువ మరమ్మతుతో పాటు కల్వర్టుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 49లక్షల రూపాయలు మంజూరు చేసింది. కాలువలో పూడిక మట్టి తొలగించారు. కల్వర్టుల నిర్మాణాలు పూర్తయ్యాయి. కల్వర్టులకు ఇరువైపులా నిర్మిస్తున్న సైడ్‌వాల్ పనులు పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈఈ వెంట ఏఈ మధు తదితరులు ఉన్నారు.

## 'ఈ పాస్' ద్వారా ఎరువులు విక్రయించాలి



ఐలాపూర్ గ్రామంలోని గోదాంలో ఎరువుల నిల్వలు తనిఖీ చేస్తున్న ఏవో అనిల్‌కుమార్

లింగంపేట, డిసెంబర్ 28: ఈ పాస్ యంత్రాల ఆధారంగానే ఎరువులు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలతో పాటు ఐలాపూర్, మోతె సహకార సంఘాల గోదాంలు, లింగంపేట, నల్లమడుగు సహకార సంఘాల్లో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న, రైతులకు విక్రయించిన ఎరువుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు కొనుగోలు చేసిన రైతుల వివరాలను కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎరువుల విక్రయ డీలర్లతో పాటు ఆయా సహకార సంఘాల సీఈవోలు పెంటయ్య, మహిపాల్ రెడ్డి ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 28: మండల కేంద్రం గోపాల్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్చన, అభిలాష్ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ సభాత్‌కృష్ణ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు అర్చన, అభిలాష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, ఈనెల 31 నుంచి జనవరి 2 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్ఎం వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.